సమస్యల పరిష్కారానికి కృషి



కాటేదాన్‌లో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కాటేదాన్‌లో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, వీధి లైట్ల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సత్వరమే పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు. మర్రి మహేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రాము, జనార్దన్ రెడ్డి, ఓంసింగ్, గోవర్ధన్ రెడ్డి, పాండు, కృష్ణారెడ్డి, ఎల్వీ రెడ్డి ఉన్నారు.

గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెమలి నగర్‌లో గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలనను విద్యుత్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మణికొండ విద్యుత్ శాఖ ఏఈ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కొన్ని దరఖాస్తుల్లో వారి సమాచారం అరకొరగా ఉందని, అయినా వారు గృహజ్యోతి పథకంపై టిక్ పెట్టడంతో వారి నుంచి మిగితా సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో గల వివేకానంద పార్కులో బీజేపీ మున్సిపాలిటీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండలో ఇతర రాష్ట్రాల వారు ఎక్కువగా ఉన్నారని, వారికి స్థానికంగా ఓటు హక్కు లేకపోవడం సమస్యగా మారిందన్నారు. అలాంటి వారికి ఓటు హక్కును కలిగించాలనే ఉద్దేశంతో ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, ఉపాధ్యక్షుడు వేణుకుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనితాదేవి పాల్గొన్నారు.

'సోకు' కాస్మొటిక్స్ ప్రారంభం

గచ్చిబౌలి: చర్మ సంరక్షణ, అలంకరణ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన 'సోకు' కాస్మొటిక్స్ నగరంలో అందుబాటులోకి వచ్చింది. కొండాపూర్‌లోని శరత్‌సిటీమాల్‌లో దీన్ని ప్రారంభించారు. సోకు డైరెక్టర్ జగతిరెడ్డి మాట్లాడుతూ సోకు సౌందర్య సాధనాలు సంప్రదాయ చర్మ సంరక్షణ లక్ష్యంగా సాగుతున్నామన్నారు. మేకప్ అనేది మీరు గర్వపడేలా రూపొందించబడ్డాయని తెలిపారు.

'నార్సింగి' బడ్జెట్ రూ.192 కోట్లు

- మున్సిపాలిటీ వార్షిక పద్దుకు ఆమోదం తెలిపిన పాలక కమిటీ
- హాజరైన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- పన్నుల రూపంలో రూ.35.22 కోట్లు
- టౌన్‌ప్లానింగ్ ఆదాయం రూ.47 కోట్లు
- ప్రస్తుత నిల్వ రూ. 98 కోట్లు



నార్సింగి మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ 2024–25 వార్షిక బడ్జెట్ రూ.192 కోట్లతో ఏకగ్రీవ ఆమోదం పొందింది. అందులో మార్చి నెలాఖరు వరకు నిల్వ మొత్తం రూ.98 కోట్లు ఉంటుండగా, వచ్చే సంవత్సరం వచ్చే ఆదాయం రూ.94 కోట్లుగా ఉండనున్నట్లు అంచనా వేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి అధ్యక్షతన జరిగిన వార్షిక బడ్జెట్ సమావేశానికి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులకు మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలను చదవి వినిపించి వారి ఆమోదం తీసుకున్నారు. పన్నుల రూపంలో వచ్చే ఆదాయం రూ. 35.22 కోట్లు ఉండగా, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ. 47 కోట్లుగా పేర్కొన్నారు. అద్దెలు, జరిమానాల రూపంలో రూ. 3.27 కోట్లు, డిపాజిట్ల ద్వారా రూ.4.70 కోట్లు, నాన్ గ్రాంట్ నిధులు రూ. 1.80 కోట్లు వస్తాయని వివరించారు.

ఖర్చులు ఇలా..

రాబోయే ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీ కార్మికుల జీతాలకు రూ.5.95 కోట్లు, శానిటేషన్‌కు రూ. 7.53 కోట్లు, విద్యుత్ చార్జీల బిల్లులకు రూ.3.38 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.8.64 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. 16.38 కోట్లను ఖర్చు చేయనున్నట్లు వార్షిక బడ్జెట్‌ను త యారు చేశారు. పరిపాలనా నిర్వహణకు రూ. 4.22 కోట్లు, ప్రజావసరాలను అభివృద్ధి చేసేందుకు రూ. 7.80 కోట్లు, వార్డు వారీగా రూ.10.80 కోట్లను ఖర్చు చేస్తామని పొందు పరిచారు. అన్ని ఖర్చులు పోను వచ్చే ఏడాది రూ.9.07 కోట్లు మిగులుతుందని అంచనాను అమోదించారు.

ప్రజావసరాలు తీర్చాలి

ప్రజావసరాలను గుర్తించడంతో పాటు వాటికి ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్‌లో పొందుపర్చడంతో పాటు ఖర్చు చేసినపుడే వారికి అన్ని రకాల సౌకర్యాలు కలుగుతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయాలను ఎక్కడా వదులుకోవద్దని, వాటిని పెంచుకునేందుకు యంత్రాంగం పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీ బడ్జెట్ రూ. 38 కోట్లు



మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శంషాబాద్: మల్లికా కన్వెన్షన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అధ్యక్షతన శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ 2024–25–ఆర్థిక సంవత్సరం రూ. 38 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా బడ్జెట్‌లో పొందుపర్చిన అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ పి. సంజయ్‌యాదవ్ గతంలో హామీనిచ్చిన ఏ ఒక్క సమస్య కూడా ఇంతవరకు పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ దవాఖానకు ఎంపీ నిధులు, ప్రత్యేక నిధులు వస్తాయని చెప్పినా ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. పట్టణంలో నిరుపేదలు పెళ్లిలు చేసేందుకు కూడా వీల్లేని విధంగా కల్యాణ మండపాల చార్జీలు ఉన్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని మహిళా మండలి భవనాన్ని ఆధునీకరంగా తీర్చిదిద్ది వారికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొన్నారు. 12 వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్ కోరారు. అలాగే పలు వార్డులోని సమస్యలను ఆయా కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిల్ ఏర్పాటై నాలుగేళ్లు పూర్తికావడంతో ఈ సందర్భంగా కౌన్సిలర్లను సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కమిషనర్ భోగీశ్వర్లు, కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, మేకల వెంకటేశ్ ముదిరాజ్, అజయ్, అశోక్, లావణ్య, లక్ష్మి, భారతమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు



మామిడికుంట చెరువును పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి



అప్పాచెరువులో కబ్జాలకు పాల్పడుతున్నారని భూపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

- అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి
- మామిడికుంట, అప్పాచెరువుల పరిశీలన

మైలార్‌దేవ్‌పల్లి: చెరువులను కబ్జాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. గగన్‌పహాడ్ సర్వే నంబర్ 247లో సుమారు 19.15 ఎకరాల్లో ఉన్న మామిడికుంట చెరువులో కొందరు కబ్జాదారులు మట్టిపోసి పూడ్చుతున్నారనే ఫిర్యాదు మేరకు శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్డీవో మల్లయ్య, జీహెచ్ఎంసీ సర్కిల్ కమిషనర్ రవికుమార్‌తో కలిసి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మామిడికుంట, అప్పాచెరువులను పరిశీలించారు. గతంలో మామిడికుంట చెరువు సుందరంగా ఉండేదని, వర్షాపు నీరు వచ్చి కళకళలాడేదని, ఇప్పుడు కొందరు అక్రమార్కుల చెంతపడి అన్యాక్రాంతంగా మారుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అదనపు కలెక్టర్ స్పందిస్తూ మామిడికుంట, అప్పా చెరువును ఎవరైనా అక్రమంగా మట్టితో పూడ్చితే పీడీయాక్ట్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సూచించారు. చెరువులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, చెరువుల జోలికి వస్తే స్థానికులు అడ్డుకొని వారి వివరాలను అధికారుల దృష్టి తీసుకురావాలని ప్రజలను కోరారు. మామిడికుంటలో పోసిన మట్టిని తొలగించాలని సూచించారు. ఆయన వెంట మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ ధనుంజయ్ , సరికొండ వెంకటేశ్ , బీజేపీ నాయకులు వినయ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, నగేశ్ సిద్ధు, సాయి, సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 10, 11, 13వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయని, తద్వారా రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేశ్, శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

చెరువు భూమిలోకి చొరబాటు

- 'వక్ఫ్' పేరిట కబ్జా
- లేని భూమిని ఉన్నట్లుగా పత్రాలు
- నెక్నాంపూర్ వాసుల ఆందోళన



వక్ఫ్ భూమిగా పేర్కొంటూ బోర్డులు పెట్టి చేపట్టిన నిర్మాణాలు



ఆందోళన చేస్తున్న నెక్నాంపూర్ వాసులు

మణికొండ: ప్రభుత్వ భూమిని ఓ హౌసింగ్ సొసైటీకి సర్కారు పూర్తిగా విక్రయించింది. అయితే అదే సర్వే నంబర్‌లోనే తమకు భూమి ఉందని పత్రాలు చూపుతూ పక్కనే ఉన్న చెరువు భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు కొందరు. ఈ విషయంపై తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామస్తులు సదరు భూమి వద్ద గురువారం ఆందోళనకు దిగారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గండిపేట మండలం, నెక్నాంపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 31లోని 59.14 ఎకరాల భూమిని 2002లో అప్పటి ప్రభుత్వం సెక్రటేరియట్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీకి ఎకరం రూ. 1.20 లక్షల చొప్పున అమ్మింది. ఇక అందులో ఎలాంటి ప్రభుత్వ భూమి లేదు. అయితే అదే గ్రామంలో పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలనే ఉద్దేశంతో వారికి విక్రయించిన భూమిలో నుంచే ఐదు ఎకరాలను ప్రభుత్వం తీసుకొని 242 మందికి 60 గజాల చొప్పున కేటాయించింది. తర్వాత అదే సర్వే నంబర్‌లోనే వక్ఫ్ బోర్డుకు 13.26 ఎకరాల భూమి ఉందని వక్ఫ్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం 2005లో గెజిట్ జారీ చేశాయి. దాంతో అప్పటి నుంచి సదరు భూమి విషయంలో రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది.

చెరువు భూమిలోకి చొరబాటు..

అయితే సర్వే నంబర్ 31లో వక్ఫ్ బోర్డుకు 13.26 ఎకరాల భూమి ఉందని వారి వద్ద పత్రాలు ఉండగా, అందులో భూమి లేకపోవడంతో పక్కనే ఉన్న నెక్నాంపూర్ పెద్ద చెరువుకు చెందిన సర్వే నంబర్ 44లోకి చొరబడి ప్రహరీలు, శ్మశాన వాటికలు నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 44లో చెరువుకు సంబంధించి 97.32 ఎకరాల భూమి ఉందని, చెరువులో ప్రస్తుతం నీరులేకపోవడంతో సదరు భూమితో పాటు బఫర్‌లో పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపడుతున్నారు. ఇదే విషయంపై గండిపేట తహసీల్దార్, రాజేంద్రనగర్ ఆర్డీఓ, కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారికి కేటాయించిన సర్వేనంబర్ ఒకటి అయితే పక్క సర్వే నంబర్‌లో నిర్మాణాలు చేపడుతున్నారని అందులో పేర్కొన్నారు.

గ్రామస్తుల ఆందోళన

తమ గ్రామానికి చెందిన చెరువు భూమిని వక్ఫ్ భూమిగా పేర్కొంటు కబ్జాకు పాల్పడుతున్నారని, ఈ విషయాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో స్థానిక కౌన్సిలర్ బి.పద్మారావు, బీఆర్ఎస్ నాయకులు జి.జయరాజ్, కె.ధన్‌రాజ్, కాంగ్రెస్ నాయకుడు తమోదన్‌రావు ఆధ్వర్యంలో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు భూమిగా పేర్కొంటూ నిర్మాణాలు చేపడుతున్న భూమిలో గతంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారని, వాటిని తొలగించడంతో పాటు చెరువులో మట్టి, రాళ్లు వేస్తున్నారన్నారు. ఆ పనులను అధికారులు వెంటనే ఆపాలని లేకుంటే తామే అడ్డుకుంటామని, ఈ విషయంలో రెండు వర్గాల మధ్య గొడవలు జరిగితే వారే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నెక్నాంపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



అన్నదానం చేస్తున్న వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి కలుగుతుందని మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. మణికొండలోని వారి అసోసియేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు తమ సేవా సంస్థ ద్వార అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసు



నోటీసును అందజేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య

రాజేంద్రనగర్: ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, 2వ ఏఎన్ఎంల జిల్లా అధ్యక్షురాలు పద్మ, సువర్ణ, సుజాత, మమత రంగారెడ్డి డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లుకు శుక్రవారం సమ్మె నోటీసును అందజేశారు. యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా పాల్గొంటారన్నారు. మోదీ పాలనలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.

ఆరోగ్య పరిశోధనలు, విద్య ఆవశ్యకతను గుర్తించాలి

'ఐఎస్‌బీ' డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల

రాయదుర్గం: నేడు ఆరోగ్య రంగంలో పరిశోధనలు, విద్య ఎంతో ప్రాముఖ్యత కలిగిన అంశాలుగా మారాయని, వీటి ఆవశ్యకతను గుర్తించాలని ఇండియన్ స్కూల్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌బీ–ఎంఐహెచ్ఎం) ఆధ్వర్యంలో 'ఐఎస్‌బీ హెల్త్‌కేర్ 4.0 సమ్మిట్ రెండవ ఎడిషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భారతదేశం వంటి దేశాలకు సామాజిక అభివృద్ధిలో ఆరోగ్య సంరక్షణ కీలకమైన అంశం అని అన్నారు. ఐఎస్‌బీ మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ అనేది ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ సెంటర్‌గా గుర్తింపు పొందిందన్నారు. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) సభ్యుడు బిసి పట్నాయక్ మాట్లాడుతూ దేశంలో 41వేల కంటే ఎక్కువ ఆస్పత్రులు ఉన్నాయని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా నగదు రహిత ఆరోగ్య బీమా అవసరమన్నారు. అందరికీ బీమా కలను నెరవేర్చాలంటే చాలా దూరం వెళ్లాలన్నారు. ఐఎస్‌బీ డిప్యూటీ డీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సారంగ్ డియో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలను కలుపుకొని ఆరోగ్య సంరక్షణలో నిర్వహణ సూత్రాలను ఏకీకృతం చేయడం అవసరమన్నారు. ప్రముఖ ఆరోగ్య నిపుణుడు డాక్టర్ నచికేత్ మోర్ ప్రసంగించారు.

క్రీడారంగంలో లింగ భేదం ఉండకూడదు

- అర్జున అవార్డు గ్రహీత ద్యుతీచంద్

రాయదుర్గం: వ్యవస్థలన్నింటినీ సులభతరం చేయడానికి అందరినీ కలుపుకొనిపోవాలని అర్జున అవార్డు గ్రహీత ద్యుతీచంద్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో 'క్వీర్ స్పేసెస్ ఇన్ స్పోర్ట్స్‌పై అబ్జర్వేషన్ అండ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫ్ స్పోర్ట్స్' అనే అంశంపై ఆమె శుక్రవారం కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ద్యుతీచంద్ మాట్లాడుతూ ఇబ్బందులు పడే స్థాయి నుంచి వచ్చిన క్రీడాకారుల కష్టాలను గుర్తించి వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడారంగంలో లింగ భేదాలకు తావు లేకుండా అందరికీ సమన్యాయం చేసేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేశ్ నాగపురి, ప్రొఫెసర్ హసంగ్ మర్చంట్, ట్రాన్స్‌జెండర్ రెఫరీ అనామికలియో, డాక్టర్ భాస్కర్ లామా, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

అవిశ్వాసానికి ముహూర్తం ఫిక్స్

ఈ నెల 22న మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

- కౌన్సిలర్లకు నోటీసులు అందించిన అధికారులు
- ఆర్డీఓ ఆధ్వర్యంలో ఓటింగ్
- తీర్మానంపై ఎవరి ధీమా వారిదే



మణికొండ మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌పై అవిశ్వాసం తీర్మానం పెడుతూ 10 మంది కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసును అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. ఈ మేరకు వారి సంతకాల పరిశీలనను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. తదుపరి చర్యగా ఈనెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు, 2019 మున్సిపల్ చట్టం సెక్షన్ 37 ప్రకారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేశారు. మీటింగ్‌కు హాజరుకావాలని కలెక్టర్ జారీ చేసిన నోటీసులను స్థానిక అధికారులు కౌన్సిలర్లకు అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వహించనున్నారు.

ఎవరి ధీమా వారిదే..

అవిశ్వాస తీర్మానంపై ఇరుపక్షాలు ధీమాగానే ఉన్నాయి. అయితే తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే ప్రతిపక్షాలకు మొత్తం 13 మంది సభ్యుల సహకారం లభించే అవకాశమే లేదని, అది వీగిపోవడం తప్పదని చైర్మన్ వర్గీయులు ధీమాగా ఉన్నారు. కౌన్సిలర్లకు అడిగినంత డబ్బు ఇవ్వనందునే అవిశ్వాస తీర్మానం పెడుతున్నారని, దీనిని రాబోయే రోజుల్లో ప్రజల వద్దనే తేల్చుకుంటామని పేర్కొంటున్నారు. అదేస్థాయిలో తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు ఇప్పటికే తమకు 12 మంది సభ్యుల బలం ఉందని, ప్రస్తుతం మరో ముగ్గురు ఓటింగ్‌లో పాల్గొని తమకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని వారు ధీమాగా పేర్కొంటున్నారు.

మణికొండలో రివర్స్ గేర్..

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో బీఆర్ఎస్‌కు చెందిన వారు చైర్మన్లుగా ఉండడం , మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఆయా మున్సిపాలిటీల సభ్యులు కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసాలు పెడుతున్నారు. అందుకు భిన్నంగా మణికొండ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన చైర్మన్‌పైనే ప్రతిపక్షాలతో పాటు అదే పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. సదరు మున్సిపల్ చైర్మన్ ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర చర్చానీయాంశంగా మారింది. ఏదిఏమైనా ఈనెల 22వ తేదీన జరిగే సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా..?లేక వీగిపోతుందా..? అనే అంశంపై మున్సిపాలిటీ పరిధిలోని ఏ ఇద్దరు కలిసినా చర్చించుకుంటున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఐఐఎంఆర్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పులి మామిడి రవీందర్, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, ఎన్.స్వామి, రఘు మారెడ్డి, కె.లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

అధికారులకు సహకరించాలి

బండ్లగూడ: క్షేత్రస్థాయిలో పరిశీలనకు వస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర కోరారు. ప్రజా పాలనలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 12, 16, 20, 21వ డివిజన్లలో అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు చేపట్టిన ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకానికి సంబంధించి రెండురోజులుగా సర్వే కొనసాగుతుందన్నారు. ప్రజలు గ్యాస్ బుక్, ఆధార్ కార్డును అధికారులకు చూపించి సహకరించాలని సూచించారు. అర్హులైన కుటుంబాలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, వార్డు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర